ఆదమరిస్తే అంతే..


కోతకు గురైన జి.మేడపాడు-వేట్లపాలెం రోడ్డు


సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్ల వద్ద కూలిన రెయిలింగ్

- ప్రమాదకరంగా కెనాల్ రోడ్డు
- కోతకు గురైన రోడ్డు, కూలిపోయిన రెయిలింగ్
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డు ప్రమాదభరితంగా మారింది. ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. మండలంలోని పీబీ దేవం గ్రామం నుంచి జి.మేడపాడు, జి.కొత్తూరు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాలకు చెందినవారు ప్రతిరోజు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. జి.మేడపాడు-వేట్లపాలెం మధ్యలో రోడ్డు కోతకు గురైంది. అదే విధంగా స్థానిక సుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్సు వద్ద కల్వర్టుకు చెందిన రెయిలింగ్ ఒక వైపు పూర్తిగా కూలిపోయింది. దీంతో చిన్న వాహనచోదకులు పీబీ దేవం తదితర గ్రామాల నుంచి సామర్లకోట వచ్చే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. కెనాల్ రోడ్డు నిర్మాణం అయినప్పటి నుంచి రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ఈ రోడ్డులో ఒక వైపు గోదావరి కాలువ మరో వైపు మురుకు కాలువలు ఉన్నాయి. ఈ రోడ్డు మీదుగా భారీ వాహనాలు రాకపోకలు జరిగే సమయంలో రోడ్డు మార్జిన్‌లోని వెళ్లిన సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పుతున్నారు. ఈ రోడ్డులో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో రోడ్డు అంధకారంతో నిండిపోతుంది. ఎదురుగా భారీ వాహనాల లైటింగ్‌కు చిన్న వాహన చోదకులు ఎక్కడ ప్రమాద ప్రదేశం ఉందో తెలియక ప్రమాదాలలో చిక్కుకుంటున్నారు.

నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

గత కాంగ్రెస్ పాలనలో ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకూ రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించి సుమారు రూ.300 కోట్లు కేటాయించారు. ఈ మేరకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న దేవాలయాలను, ఆక్రమణలను తొలగించారు. దీనిలో భాగంగా అనేక మందికి అప్పట్లో నష్ట పరిహారం కూడా చెల్లించారు. కాంగ్రెస్ ఓటమితో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. దాంతో కెనాల్ రోడ్డులో యాథావిధిగా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఈ కెనాల్ రోడ్డు వెంబడి అడుగు అడుగునా గోతులు ఏర్పడంతో చిన్న వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు వెడల్పు చేయడాన్ని నిలిపివేసిన అధికారులు కెనాల్ రోడ్డు నిర్మాణంలో ఎందుకు జాప్యం చూపుతున్నారో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కెనాల్ రోడ్డులో గోదావరి కాలువ వైపు తుప్పలు పెరిగిపోయి ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టు రెయిలింగ్‌ను కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

కెనాల్ రోడ్డు కోతతో..



కెనాల్ రోడ్డు వెంబడి మార్జిన్ కోతకు గురైంది. మేడపాడు నుంచి సామర్లకోట వచ్చే సమయంలో రాత్రి సమయం భయంగా ఉంటోంది. మేడపాడు-వేట్లపాలెం మధ్య రోడ్డు కోతకు గురై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోలేదు. మేడపాడు-వేట్లపాలెం మధ్యలో రోడ్డు గోతులతో ఉంది. సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీ వద్ద కల్వర్టు రైలింగ్ కూలిపోయింది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు.

– మోరంపూడి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, జి.మేడపాడు

అధికారుల దృష్టికి తీసుకువెళతాం



కెనాల్ రోడ్డు ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళతాం. ఈ మేరకు మండల పరిషత్ సమావేశానికి తప్పనిసరిగా ఆర్‌అండ్‌బీ అధికారులు హాజరయ్యేలా ఎంపీడీఓకు సూచనలు ఇస్తాం. సుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్సు వద్ద కల్వర్టు రైలింగ్ కూలిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా వేట్లపాలెం కల్వర్టుకు చెందిన ఇనుప రెలింగ్ శిథిలం అయింది. వెంటనే దీనిని మరమ్మతులు చేయించవలసిన బాధ్యత అధికారులపై ఉంది.

– బొబ్బరాద సత్తిబాబు, ఎంపీపీ, వేట్లపాలెం

శిక్షణతో ఆర్థిక అభ్యున్నతి


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఆలోచనతో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శారిస్ స్క్రీన్ పెయింటింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు అన్నారు. రెండు రోజుల పాటు లయన్స్ క్లబ్ భవనంలో మహిళలకు నిర్వహించిన ఉచిత శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ చీరలతో పాటు సాదా చీరలపై ఈ స్క్రీన్ పెయింటింగ్ వేయడంతో అందం ఉంటాయన్నారు. ఈ శిక్షణ పొందడానికి రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు అవుతుందని, లయన్స్ క్లబ్ ముందుకు వచ్చి ఈ ఉచిత శిక్షణ ఇస్తుందన్నారు. పేద ప్రజలకు సేవలు చేయాలనే లక్ష్యంతో లయన్స్ ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని సాధించడానికి సామర్లకోట లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి శ్రీనివాసరావు, కోశాధికారి యేలేటి రమేష్, మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, మాజేటి కృష్ణ, బుర్రే కృష్ణమోహన్, కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొనగా టీచర్లు బి జ్యోతి, వై.మాధవి శిక్షణ నిర్వహించారు. సుమారు 150 మంది శిక్షణ పొందారని శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు లయన్స్ క్లబ్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి


సిరివాడలో బాణసంచా షాపులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పెద్దాపురం(సామర్లకోట): బాణసంచా వ్యాపారస్తులు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పెద్దాపురం తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. సిరివాడ గ్రామంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ షాపులను శనివారం ఆమె పరిశీలించారు. ప్రతి షాపు వద్ద నీళ్ల డ్రమ్ముతోపాటు ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఉండాలన్నారు. షాపు లైసెన్సు డిస్‌ప్లే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కాకినాడ రూరల్: అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్టు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన పోష్టికాహారం అందజేయడం ద్వారా శిశు మరణాలు తగ్గాయన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, ఎంపీడీఓ సతీష్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, జిల్లా బాలల సంక్షేమాధికారి వెంకట్రావు, బీజేపీ నాయకుడు రంబాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను చూస్తూ ఊరుకోం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దొరబాబు
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
- గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు


వీకే రాయపురంలో మహిళల సంతకాలు సేకరిస్తున్న దొరబాబు తదితరులు


వీకే రాయపురం గ్రామ కమిటీని ప్రకటించిన దొరబాబు

సామర్లకోట: పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలనే లక్ష్యంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 17 కళాశాలకు అనుమతి తీసుకొని వస్తే వాటిని ప్రస్తుత ప్రభుత్వ ప్రైవేటు పరం చేస్తోందని, దీనిని చూస్తూ ఊరుకోమని, దీనికి వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. మండల పరిధిలో వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో శనివారం సాయంత్రం మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల సమస్యను ప్రజల వద్దకు తీసుకు వెళ్లడానికి రచ్చ బండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం 17 మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించగా అందులో ఐదు పూర్తయి క్లాసులు మొదలయ్యాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రత్యేక జీఓ ద్వారా నిర్మాణాలను నిలుపుదల చేశారని ఆరోపించారు. పీపీ విధానంలో కూటమి అనుచరులకు ఈ మెడికల్ కళాశాలలు అప్పగించడానికి లోకేష్, చంద్రబాబు నాయుడుల బినామిలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తి నర్సీపట్నంలో మెడికల్ కళాశాలలు లేవని సవాల్ చేయడంతో జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం వెళ్లారని, ఈ పర్యటనకు అనేక ఆంక్షలు విధించినా వేలాది మంది అభిమానులు తరలి వచ్చారని గుర్తు చేశారు. అబద్దాలతో అధికారంలోనికి వచ్చిన నాయకులు ఇంకా అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేయడం వింతగా ఉందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వ కళాశాలలు నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీటి నిర్మాణా నికి కేవలం రూ.ఐదు వేల కోట్లు మాత్రమేనని అన్నారు. నవంబర్ 22 వరకు ప్రతి గ్రామంలో పర్యటించి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల సేకరణలో భాగంగా నియోజవర్గం నుంచి 50 వేల సంతకాలు సేకరించి మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. ఈనెల 28న నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. నవంబర్ 12న కాకినాడ ఏడు నియోజకవర్గాల నాయకులు, మేధావులు, వివిధ పార్టీ నాయకలతో ర్యాలీ ఉంటుందన్నారు. నవంబరు 22న సేకరణ చేసిన సంతకాలను గవర్నర్‌కు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెలమర్తి బుల్లిరాజు, రైతు నాయకుడు ఇంటి వెంకట్రావు, జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, జిల్లా అధికార పార్టీ ప్రతినిధి విష్ణు, నియోజకవర్గ జిల్లా పరిషత్తు వింగ్ అధ్యక్షుడు నాగనబోయిన రాజబాబు, ఉండూరు ఉప సర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బదిరెడ్డి

వీకే రాయపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బదిరెడ్డి వీరప్రకాశరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా వెలమర్తి శ్రీనివాసు, అడబాల రాజుబాబు, తలారి సుభ కరరావు, రేలంగి నాగబాలాజీగౌడ్, కార్యదర్శులుగా మోటూరి సూరిబాబు, చెరిచర్ల జక్కరియ్యా, గోనిపాటి బుజ్జి, ఇజ్జన ప్రసాద్, వీరభత్తుల నాగేశ్వరరావు, వేలు శ్రీను ఎన్నికయ్యారు. వీరిని దొరబాబు అభినందించారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలి

- తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి
- కార్తిక మాస ఉత్సవాలపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సామర్లకోట: కార్తిక మాసంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం పంచారామ క్షేత్రంలో కార్తిక మాసంలో ఏర్పాట్లపై ఈఓ బళ్ల నీలకంఠం అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సూచించారు. కార్తిక మాసంలో భక్తులు కోనేరులో స్నానాలు చేసే అవకాశం ఉన్న కారణంగా కోనేరులో నీరు శుభ్రంగా ఉండాలన్నారు. ఉచిత దర్శనంతో పాటు ఇతర దర్శనాలకు సంబంధించి క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు నెల రోజుల పాటు కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. అమావాస్య వెళ్లిన మరుసటి రోజు నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుందన్నారు. 21వ తేదీ సాయంత్రం ఆరు గంటకు ఆకాశదీపంతో కార్తిక మాస ఉత్సవాలను ప్రారంభించి 22 నుంచి దర్శనాలు ఉంటాయన్నారు. నాలుగు ఆది వారాలు, నాలుగు సోమవారాలలో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. అదే విధంగా నవంబర్ 5న కార్తిక పౌర్ణమి, 6న కృతిక నక్షత్రంను పురస్కరించుకొని గ్రామోత్సవం ఉంటుందన్నారు. స్వామి వారు ఆలయానికి తిరిగి వచ్చిన తరువాత రాత్రి జ్వాలా తోరణం జరుగుతుందని తెలిపారు. నవంబరు 18న మాసశివరాత్రి ఉత్సవం, 20న అమావాస్యను పురస్కరించుకొని కోటి దీపోత్సవం, 21న పోలి పాడ్యమిని పురస్కరించుకొని స్వామివారికి జటాఝుటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. కార్తిక సోమవారాలలో తెల్లవారు జాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. మిగిలిన రోజుల్లో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి10 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే జగదీష్‌మోహనరావు, మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య, సీఐ ఎ కృష్ణభగవాన్, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్ జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ పండితులు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన మండల కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

పిఠాపురం: సీఐటీయూ మండల మూడో మహాసభ స్థానిక బైపాస్ రోడ్డు వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో కరణం విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.శేషాబాబ్జి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా గత ప్రభుత్వాలు చేస్తున్న తప్పులు కూటమి ప్రభుత్వం కూడా చేసుకుంటూ పోతుందని విమర్శించారు. 10 గంటల పని విధానాన్ని తీసుకు వచ్చి కార్మికులపై భారాన్ని మరింత పెంచుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయడం దారుణం అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కి కావలసినవి నిధులు కాదని గనులు కేటాయించి దాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగేలాగా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికరంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్న నేటికీ కూడా భవన నిర్మాణ కార్మికులకి వెల్ఫేర్ బోర్డు పునర్ధరణ చేస్తాం అని చెప్పిన వాగ్దానాన్ని మరిచారన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీ కన్వీనర్‌గా కుంచె చిన్న, కో కన్వీనర్లుగా జిరబాబు, విజయశాంత, ఎం పద్మావతి, పప్పుల వీరబాబు, ఎ.లోవరాజు, పి.సూర్యచక్రం, అప్పన్నబాబు, డి.సత్యనారాయణ, సభ్యులుగా ఎం.సూరిబాబు, దుర్గ, సుజాత, గోవిందు, డి.నాగేశ్వరరావు, మోహనాచార్యులు మణికంఠ, వి.సూర్యనారాయణ, గోపాలకృష్ణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గొల్లప్రోలు యూత్ కొత్తపల్లి మండలాల సీఐటీయూ కార్యదర్శులు ఓ నందీశ్వర రావు కే సత్యనారాయణ, సిఐటియు అనుబంధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

బాణసంచా వ్యాపారుల్లో గుబులు


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

సామర్లకోట: ఒక్కసారిగా శనివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కురవడంతో బాణసంచా వ్యాపారస్తుల్లో గుబులు ప్రారంభమైంది. పట్టణ పరిధిలో 14, పెద్దాపురం పట్టణంలో 25, సామర్లకోట రూరల్ పరిధిలో 11, పెద్దాపురం రూరల్ పరిధిలో మూడు తాత్కలిక బాణసంచా షాపులు ఏర్పాటు చేశారు. ఊహించని విధంగా వర్షం కురియడంతో కొంత మంది షాపులో బాణసంచా తడిచిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. వర్షానికి డ్రైన్లు పొంగి ప్రవహించడంతో డ్రైన్లలో నీరు రోడ్లపైకి చేరింది. స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణ పురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథంసెంటర్, షిర్డిసాయిబాబా రోడ్డు, వెలమపేట, సంగీతరావు పేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లు చెరువులుగా మారిపోయాయి. స్టేషన్ సెంటర్‌లో రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైనులో నీటి ప్రవాహానికి సత్యనారాయణపురం రోడ్డు చెరువుగా మారింది. ఆ రోడ్డులో అడుగు అడుగునా గోతులు ఉండడంతో వాహనచోదకులు తమ వాహనాలను నడిపించుకొని వెళ్లారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి డ్రైన్ల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులోనికి చేరుతుంది. అయితే ఆ డ్రైను నిండిపోవడంతో జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. బస్సు కాంప్లెక్స్‌లోనికి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నిబంధనలు బేఖాతరు

- మందుగుండు సామగ్రి అమ్మకాలపై కొరవడిన పర్యవేక్షణ
- మామూళ్ల మత్తులో అధికారులు


మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న షాపులు

కొత్తపల్లి: మండలంలో దీపావళి సందడి గత రెండు రోజుల ముందు నుంచే ప్రారంభమైంది. మందుగుండు సామగ్రి విక్రయాల్లో వ్యాపారులు ఎటువంటి నియమ నిబంధనలు పాటించడంలేదు. షాపులను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందుగుండ సామగ్రి వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలు రేకు షెడ్డులోనే ఏర్పాటు చేయాలి. షాపుల వద్ద అగ్ని ప్రమాదాల నియంత్రణకు సంబంధించి ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడంలేదు. షాపుల వద్ద తప్పని సరిగా డ్రమ్ముల్లో నీరు, ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచుకోవాలి. షాపు నిర్వాహకులు మాత్రం ఖాళీగా ఉన్న డ్రమ్ములను ఉంచుతున్నారు. ధరలు అధికంగా, ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కన్నా ఈసారి ధరలు రెట్టింపయ్యాయని అంటున్నారు. మండలంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలో వాకతిప్ప-2, ఉప్పాడ-2, మూలపేటలో మూడు, కొండెవరంలో ఒకటి మందుగుండు సామగ్రి షాపులను భారీగా ఏర్పాటు చేశారు. సామగ్రిని విక్రయించే షాపుల వద్ద రక్షణ చర్యలు మాత్రం మచ్చుకైనా కనిపించడంలేదు. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధరలు పెరిగినా కొనుగోలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. అయితే కొంతమంది బాణసంచా అమ్మకాలకు అనుమతులు లేకున్నా లోపాయికారిగా అమ్మకాలను సాగించడానికి సిద్ధమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణను వివరణ కోరగా నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

హక్కులను కాపాడేందుకే బాలికా దినోత్సవం

పిఠాపురం: బాలికల హక్కులను కాపాడేందుకే బాలికా దినోత్సవం నిర్వహిస్తుండాలని పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దుర్గాదేవి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో శనివారం ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి. శ్యాంబాబు, డాక్టర్లు వై.వినయ్, సీహెచ్ వరలక్ష్మి, కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సామర్లకోట: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి రైతుల్లో అవగాహన పెంచాలని తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సిబ్బందికి శనివారం సాయంత్రం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ధాన్యంలో తేమ శాతంతో పాటు, ధాన్యంలో రాళ్లు, పొల్లు వంటి విషయాలను రైతులకు అవగాహన పెంచి తెలియజేయాలని సూచించారు. ప్రతి రైతు నిబంధనల మేరకు ధాన్యం విక్రయించేలా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

పెద్దాపురం(సామర్లకోట): త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో పెద్దాపురం పట్టణ పరిధిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ మాట్లాడుతూ ఎరువుల షాపుల్లో స్టాక్‌కు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ఎరువుల ఇన్‌వాయిస్, అమ్మకాలు చేసిన రసీదు పుస్తకాలు సక్రమంగా ఉండాలన్నారు. ప్రతి ఎరువుల షాపులోను లైసెన్సు డిస్‌ప్లే చేయాలని సూచించారు. షాపుల వద్ద నోటీసు బోర్డులో ఎరువుల ధరలతో పాటు నిల్వకు సంబంధించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రతి రోజు తేదీలు ఉండాలన్నారు. నాణ్యత కలిగిన పురుగు మందులను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, మండల వ్యవసాయాధికారి సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్ పరిశీలన


బాలుర హాస్టల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సామర్లకోట: పెద్దాపురం లీగల్ సర్వీసు కమిటీ సభ్యులు శనివారం రాత్రి పెద్దాపురం సుధాకాలనీలోని బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ భోజనాలను పరిశీలించారు. ఈ మేరకు అన్నంతోపాటు కూరలు, సాంబారులను క్షుణంగా పరిశీలించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

కాకినాడ రూరల్: చదువుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) జి.నాగమణి సూచించారు. ఏపీఎస్పీ స్కూల్ కాంప్లెక్స్‌ను శనివారం మధ్యాహ్నం ఆమె సందర్శంచారు. ఈ సందర్భంగా స్కూల్ కాంపెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కుటుంబ, ఆర్థిక, మానసికపరమైన సమస్యలు తెలుసుకుని విద్యాబుద్ధులతోపాటు పిల్లల భవిష్యత్ ప్రణాళికలను కూడా కార్యదీక్షతో తీర్చిదిద్దాలన్నారు. ఎఫ్ఏ-2 పరీక్షల సమాధాన పత్రాలను ఆమె పరిశీలించారు. వెంటనే పేపర్లు దిద్ది మార్కులు జాగ్రత్తగా వేయాలని సూచించారు. డి గ్రేడ్‌లో ఉన్న వారిని ఏ అంశంలో వెనకబడి ఉన్నారో గుర్తించి, వారికి రెమెడియల్ వర్క్ ఇవ్వాలన్నారు. నెలాఖరున పదవి విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చామంతి నాగేశ్వరరావు, సత్యవోలు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.